నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 14 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

బడుగులకు శుభాకాంక్షలు

మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

ఈ ఏడాది నుంచే మెడికల్ కాలేజ్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు

- తాత్కాలికంగా పాత కలెక్టరేట్ భవనంలో ప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- మెడికల్ కాలేజీకి అనుగుణంగా మరమ్మతులు
- తొలుత అందుబాటులో 50 ఎంబీబీఎస్ సీట్లు
- అనుబంధ ఆస్పత్రిగా భువనగిరి జిల్లా హాస్పిటల్
- కొనసాగుతున్న రిక్రూట్‌మెంట్ ప్రక్రియ
- గుట్టలో భవనం పూర్తయ్యాక అక్కడికే తరలింపు

యాదాద్రి మెడికల్ కాలేజీ ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి రానుంది. పర్మినెంట్ బిల్డింగ్‌కు ఆలస్యం కావడంతో తాత్కాలిక భవనంలో భువనగిరిలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత 50 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాల అందుబాటులోకి రానున్నది. కాలేజీకి అనుబంధంగా భువనగిరి జిల్లా ఆస్పత్రి ఉండనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాలేజీ మంజూరు కాగా.. పేద విద్యార్థులకు ఎంతగానో దోహదపడనున్నది.

– యాదాద్రి భువనగిరి, జూన్ 13 (నమస్తే తెలంగాణ)

మెడికల్ కళాశాల కోసం తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్న భువనగిరి మున్సిపాలిటీ పరిధి పగిడిపల్లిలోని పాత కలెక్టరేట్ భవనం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నాటి బీఆర్ఎస్ సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసింది. అందులో భాగంగా జిల్లాలోని యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు గతేడాది జూలై 6న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జీఓ నంబర్ 85ను విడుదల చేసింది. 100 సీట్ల కెపాసిటీతో కాలేజీ ఏర్పాటు చేస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని జీఓలో పేర్కొన్నారు. ఆ తర్వాత శ్రీలక్ష్మీనరసింహస్వామి మెడికల్ కాలేజీగా నామకరణం కూడా చేశారు. కాలేజీ నిర్మాణానికి రూ. 183 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ప్రిన్సిపాల్‌గా మల్లిఖార్జునను నియమించారు. ఈ ప్రక్రియలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఎంతో కృషి చేశారు.

ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం..

మెడికల్ కాలేజీ ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానుంది. మొదట 50 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభించనున్నారు. నీట్ షెడ్యూల్ ఆధారంగా తరగతులు షురూ అవుతాయి. యాదగిరిగుట్టలో సొంత భవన నిర్మాణానికి ఆలస్యం కానుండడంతో ప్రస్తుతానికి భువనగిరిలో తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేయనున్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని పగిడిపల్లిలో ఉన్న పాత కలెక్టరేట్ భవనంలో కొనసాగించాలని నిర్ణయించారు.

శాశ్వత మెడికల్ కాలేజీ గుట్టలోనే..

యాదగిరిగుట్టలోనే శాశ్వత మెడికల్ కాలేజీ నిర్మాణం కానుంది. మొదట ఓ చోట నిర్మించాలని భావించినా స్థలానికి సంబంధించి ఇబ్బందులు తలెత్తడంతో మార్పులు జరిగాయి. భవన నిర్మాణం, క్యాంపస్ కోసం 20 ఎకరాల భూమి అవసరం పడుతుంది. గుట్టలోని సబ్ స్టేషన్ పక్కన ఉన్న స్థలాన్ని ఫైనల్ చేశారు. త్వరలోనే ఇక్కడ పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. గుట్టలో కాలేజీ నిర్మాణానికి సుమారు ఏడాది పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. అప్పటి వరకు పాత కలెక్టరేట్ ఆఫీసులోనే మెడికల్ కాలేజీ కొనసాగనుంది.

ఇందుకోసం బిల్డింగ్‌ను ఇప్పటికే అద్దెకు తీసుకున్నారు. మెడికల్ కాలేజీకి అనుగుణంగా మరమ్మతులు చేపడుతున్నారు. ఇక జూనియర్ డాక్టర్లను రిక్రూట్ చేసుకున్నారు. తాజాగా జరిగే ప్రమోషన్లు, బదిలీల్లో ఫ్యాకల్టీని నియమించనున్నారు. దీనికి అనుబంధంగా పట్టణంలోని జిల్లా ఆస్పత్రి కొనసాగనుంది. ఇటీవల జిల్లా ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి మార్చిన విషయం తెలిసిందే. ఇందులోనూ పలు వార్డులు పునరుద్ధరిస్తున్నారు.

ఎన్నో విధాలుగా మేలు..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాలేజీని కొడంగల్‌కు తరలించుకుపోతారనే ప్రచారం జరిగింది. కానీ స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో తరలింపునకు ఫుల్ స్టాప్ పడింది. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా వాసులకు ఎన్నో విధాలుగా మేలు జరుగనుంది. కళాశాల ఉంటే దానికి అనుబంధంగా ఆస్పత్రి ఉంటుంది. దీని ద్వారా వందల మందికి నిత్యం సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించవచ్చు. సూపర్ స్పెషాలిటీ సేవలు కలుపుకొని, మొత్తం 35 రకాల వైద్య విభాగాల సేవలు అందే అవకాశం ఉంటుంది. అత్యాధునిక వైద్య పరికరాలు, ల్యాబ్‌లు ఉంటాయి. డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులోకి వస్తారు. మెడికల్ కాలేజీతో అనుబంధంగా అనేక వసతులు ఏర్పడనున్నాయి. కళాశాల ఏర్పాటుతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగనున్నాయి. ప్రత్యక్షంగానే కాకుండా పరోక్షంగా కూడా వందల మందికి ఉపాధి దక్కనుంది.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 13 : జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జడ్పీ 15వ ఆర్థిక సంఘం, స్పెషల్ గ్రాంట్, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ నిధుల నుంచి మంజూరైన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రగతిలో ఉన్న పనులపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించిన మండల ఏఈలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టే, చేపడుతున్న పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎన్.శోభారాణి, ఉపముఖ్య కార్యనిర్వహణ అధికారి డి. విష్ణువర్ధన్‌రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల ఏఈలు పాల్గొన్నారు.

బీబీనగర్‌లో ధరణి దరఖాస్తుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంత్ జెండగే

ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంత్ జెండగే

బీబీనగర్/బొమ్మలరామారం, జూన్ 13 : ధరణి దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే అన్నారు. బీబీనగర్, బొమ్మలరామారం తాసీల్దార్ కార్యాలయాలను గురువారం ఆయన సందర్శించారు. ధరణి దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే క్లియర్ చేయాలని, పెండింగ్ లేకుండా వేగవంతంగా చేయాలని తాసీల్దార్లను ఆదేశించారు. ఆయన వెంట తాసీల్దార్లు మంతపురపు శ్రీధర్, శ్రీనివాస్‌రావు, డిప్యూటీ తాసీల్దార్ భగత్, సాయి తదితరులు ఉన్నారు.

మైనారిటీ విద్యార్థులకు గ్రూప్-1, 2లో ఉచిత శిక్షణ

నీలగిరి, జూన్ 13 : గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 45 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మైనారిటీ అభ్యర్థులు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి, టి.విజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను నల్లగొండ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో జూన్ 18 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9494345471, 7981196060 నంబర్లలో లేదా కార్యాలయ పనివేళ్లలో సంప్రదించాలని తెలిపారు.

నిడమనూరు చెరువులో మట్టిపోసి చదును చేసిన దృశ్యం

చెరువు శిఖంలో ఆగని ఆక్రమణలు

- అడ్డగోలుగా నిడమనూరు నల్లచౌట చెరువు శిఖం కబ్జా
- ఆనవాళ్లు కోల్పోతున్న చెరువు
- ఇప్పటికే చెరువు చుట్టూ 100 ఎకరాలకు పైగా కబ్జా

నిడమనూరు, జూన్ 13 : మండల కేంద్రంలోని నల్లచౌట చెరువు శిఖం ఆక్రమణలు ఆగడం లేదు. చెరువు శిఖం వెంట వ్యవసాయ భూములు కలిగిన రైతులు ఏటా కొంత భూమిని ఆక్రమిస్తుండడంతో ఇప్పటికే చెరువు రూపురేఖలు మారిపోయాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, ఎడమ కాల్వకు నీటి విడుదల లేకపోవడంతో చెరువులో నీరు ఖాళీ అయ్యింది. ఈ కారణంగా శిఖం భూముల్లో దర్జాగా చెరువు మట్టిని తవ్విస్తున్నారు. చెరువు చుట్టూ స్థానికులు ఫిర్యాదు చేసినా సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కనీస చర్యలు చేపట్టి ఆక్రమణలను అడ్డుకునేందుకు అందుబాటులోకి రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చారిత్రక చెరువు ఆనవాళ్లు మాయం

నిజాం నవాబుల హయాంలో సర్వే నంబర్ 372లో 307.13 ఎకరాల్లో నిర్మించిన నల్లచౌట చెరువు పలు గ్రామాలకు వరప్రదాయినిగా ఉంది. చెరువుపై ఆధారపడి మత్స్యకార్మికులు చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువును పునరుద్ధరించారు. ఆ తర్వాత చెరువు శిఖంలో ఏటా ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి.

దాంతో చారిత్రక చెరువు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. ఇప్పటికే చెరువుకు నాలుగు వైపులా సుమారు 100 ఎకరాల పైనే కబ్జాకు గురైనట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గతంలో ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న అధికారులు శిఖం పరిరక్షణకు బాధ్యతాయుతమైన చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆక్రమణల నివారణకు సమగ్ర విచారణ జరిపి శిఖం పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ డీఈ శ్రీనివాస్ వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

జీలుగ విత్తనాల్లేవ్..

- కొనుగోలు కేంద్రాల్లో కానరాని పచ్చిరొట్ట
- స్టాక్ లేకపోవంతో వెనుదిరుగుతున్న రైతులు
- జిల్లాలో ఎక్కడా కనిపించని సన్నాలు
- రూ. 500 బోనస్ ఎట్లిస్తరని ఆగ్రహం

యాదాద్రి భువనగిరి, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లాలో జీలుగ విత్తనాలు, సన్నాలకు కొరత ఏర్పడింది. ప్రభుత్వ కేంద్రాల్లో ఎక్కడా అటు జీలుగ విత్తనాలు, ఇటు సన్నాలు అందుబాటులో లేవు. జీలుగ కోసం కేంద్రాలకు వచ్చి వట్టి చేతులతోనే వెనుదిగిపోతున్నారు. మరోవైపు సన్నాలకు బోనస్ ఇస్తామన్న ప్రభుత్వం సన్న విత్తనాలు సరఫరా చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జీలుగు, వరి విత్తనాలు

విత్తనాల కోసం పడిగాపులు

వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులు సాగు పనుల్లో బిజీ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4,59,850 ఎకరాల్లో సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 2,85,000 ఎకరాల్లో వరి, 1,35,000 ఎకరాల్లో పత్తి, 8,500 ఎకరాల్లో పప్పు గింజలు, 200 ఎకరాల్లో మిల్లెట్లు, 150 ఎకరాల్లో ఆయిల్ సీడ్స్, 21,000 ఎకరాల్లో ఇతర పంటలు వేసే అవకాశం ఉందని భావిస్తున్నది. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో జీలుగ విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ కేంద్రాల్లో ఎక్కడా జీలుగ విత్తనాలు దొరుకడం లేదు. రైతులు జీలుగ విత్తనాల కోసం పడిగాపులు కాయాల్సి వస్తున్నది. పచ్చిరొట్ట లేకపోవడంతో కర్షకులు నిరాశగా వెనుదిరిపోతున్నారు. తొలి విడుత కొంత మేర వచ్చినా వెంటనే కొనుగోలు జరిగింది. ఆ తర్వాత మళ్లీ జీలుగ విత్తనాలు రావడం లేదు. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం చౌటుప్పల్‌లోని గోదాములో 240 క్వింటాళ్ల జీలుగ ఉందని చెబుతున్నప్పటికీ జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో మాత్రం కొరత కనిపిస్తున్నది. అధికారులు చర్యలు తీసుకుని సరిపడా జీలుగ విత్తనాలు సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సన్నాలు సున్నా..

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రభుత్వ కేంద్రాల్లో వరి సన్న విత్తనాలు అన్న ముచ్చటే లేదు. ఏ ఒక్క కేంద్రం వద్ద కూడా సన్నాలు లేవు. జిల్లాలో యాసంగి సీజన్‌లో పూర్తిగా దొడ్డు రకం వరి మాత్రమే వేస్తారు. వానకాలం సీజన్‌కు వచ్చే సరిగికి 75శాతం దొడ్డు, 25శాతం సన్న రకం వరి వేస్తారు. కనీసం 25శాతం కూడా కేంద్రాల్లో దొరక్కపోవడం గమనార్హం. మరోవైపు ప్రభుత్వం మాత్రం వరి సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని చెబుతున్నది. ప్రభుత్వమే కావాలనే సన్నాలను అందించడం లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రైవేట్‌లో సన్నాలు దొరుకుతున్నప్పటికీ అధిక ధరలు కావడంతోపాటు నకిలీ, నాసిరకం అమ్ముతున్నారు. సన్నాలు సైతం విక్రయించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కనీస అవగాహన కరువు..

రైతులు జీలుగ సాగు చేస్తే చక్కటి ఫలితాలు సాధించవచ్చు. తక్కువ సారవంతమైన భూముల్లో నల్లని మట్టిని వేస్తే మంచి దిగబడుగులు వస్తాయి. రైతులు మట్టిని వేసే బదులు నేల స్వభావాన్ని బట్టి పచ్చి రొట్ట ఎరువుల సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చు. రైతులు అందుబాటులో ఉన్న జీలుగ విత్తనాలను సాగు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ విత్తనాలను ఆయా మండల కేంద్రాల్లోని ఆగ్రో సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేది. అయితే వ్యవసాయ శాఖ అధికారులు జీలుగ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించడం లేదు. క్షేత్రస్థాయిలో తూతూమంత్రంగా రైతు సమావేశాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రైతులకు అందుబాటులో ఉంచాలి

వర్షాకాలం కావడంతో రైతులు నాట్లు వేస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం అన్ని రకాల విత్తనాలు సిద్ధంగా ఉంచాలి. జిల్లాలో జీలుగ విత్తనాలు దొరకడం లేదు. ప్రైవేట్‌లో కొనుక్కుంటే నాసిరకం, అధిక ధరలు ఉంటాయి. సన్నాలు సైతం దొర్కపోవడం దురదృష్టం. సన్నాలు లేకుంటే రూ. 500 బోనస్ ఎట్లా ఇస్తారు..?ప్రభుత్వం అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలి.

– కొండమడుగు నరసింహ, రైతు సంఘం నాయకుడు

కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యుత్ ఉద్యోగులు

ఉత్సాహంగా విద్యుత్ ఉద్యోగుల క్రీడలు

బొడ్రాయిబజార్, జూన్ 13 : క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని ట్రాన్స్‌కో ఎస్ఈ పాల్‌రాజ్ అన్నారు. టీజీ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన సూర్యాపేట, నల్లగొండ విద్యుత్ ఉద్యోగులకు కబడ్డీ, చెస్ టోర్నమెంట్‌ను గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్పోర్ట్స్ కౌన్సిల్ ఆపరేషన్ సర్కిల్ టీజీఎస్‌పీడీసీఎల్ నిర్వహణలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో విద్యుత్ ఉద్యోగులు వివిధ జట్లుగా ఏర్పడి క్రీడలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ క్రీడా పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతి ప్రదానం చేయనున్నారని, దీనికి టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ ముషరఫ్ ఫారూఖ్ హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో కబడ్డీ 11, చెస్ పోటీల్లో 16 టీమ్‌లు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈలు డానియేల్, వెంకటకృష్ణయ్య, శ్రీనివాస్, రాజశేఖర్, భీమానాయక్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనివాస్, టౌన్ ఏఈ సురేశ్, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

జీహెచ్ఎం పదోన్నతులు పూర్తి

- మల్టీ జోన్-2లో 700 మందికి అవకాశం

ఆలేరు రూరల్, ఆత్మకూరు(ఎం), జూన్ 13 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా స్కూల్ అసిస్టెంట్ నుంచి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ గురువారం ముగిసింది. మల్టీ జోన్- 2లో 700 మంది స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం వచ్చింది. జిల్లాలో పలువురు సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి లభించింది. వీరంతా గురువారం ఉత్తర్వులు అందుకొని ఆయా పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూర్.ఎం మండలంలోని 6 ఉన్నత పాఠశాలలకు కొత్త హెచ్ఎంలు వచ్చారు. ఆలేరు మండలం టంగుటూరు జడ్పీ హెచ్ఎంగా కోడం రమాదేవి నియామకమయ్యారు. ఈ సందర్భంగా కొత్త జీహెచ్ఎంలకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

ఆలేరురూరల్ : టంగుటూరు జడ్పీ హెచ్ఎంగా కోడం రమాదేవి బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు చేపడుతున్న మహదేవరెడ్డి

17న 'మమతల పందిరి' కవితా సంపుటి ఆవిష్కరణ

మోత్కూరు, జూన్ 13 : ఈ నెల 17న 'మమతల పందిరి' కవితా సంపుటిని ఆవిష్కరించనున్నట్లు మోత్కూరు ప్రజాభారతి సాహిత్య సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డి.అరవిందరాయుడు, గుమిడెల్లి వెంకన్న తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కవితా సంపుటి కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ పూర్వ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కవి మర్రి జయశ్రీ సాహిత్య పుస్తకం రూపొందించినట్లు తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిదారెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, ప్రముఖ గేయ రచయిత అభినయ శ్రీనివాస్ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. మోత్కూరు పట్టణంలోని వైజే ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా కవులు, సాహితీపరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు ఎస్ఎన్ చారి, పూర్వ ప్రధాన కార్యదర్శి జయశ్రీ, టి.ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, మనోహర్, యాకస్వామి పాల్గొన్నారు.

రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని ధర్నా

నకిరేకల్, జూన్ 13 : స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితి పెంచి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కందాల ప్రమీల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో గ్రామీణ వికాస్ బ్యాంక్, ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో పంట పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, బ్యాంకులు రుణాలు ఇవ్వక పోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా బ్యాంక్ మేనేజర్లకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రైతుసంఘం మండలాధ్యక్షుడు వెంకటరంగారెడ్డి, కార్యదర్శి వెంకటయ్య, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, ప్రకాశ్‌రావు, మండల ఉపాధ్యక్షులు గుడిసె స్వరూప, పరమప్ప లక్ష్మణరావు, రాచకొండ వెంకట్‌గౌడ్, వెంకటేశ్వర్లు, భాస్కర్ పాల్గొన్నారు.